# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

FEBRUARY - 2001

# రేడియో శ్రీలంక ద్వారా
# క్రీస్తు సంఘముల సువార్త ప్రసార కార్యక్రమములు

తెలుగు : **సత్యవాణి**
ప్రతి ఆది, మంగళ, బుధ, గురు వారాల్లో
మధ్యాహ్నం 2-00 గంాల నుండి 2-15 వరకు.
ప్రసంగీకులు : జాషువా గూటం, కాకినాడ.

హిందీ : **సత్య సుసమాచార్**
ప్రతి ఆదివారం రాత్రి 8-45 నుండి 9--00 వరకు,
ప్రతి గురువారం రాత్రి 9-00 నుండి 9-15 వరకు.
ప్రసంగీకులు : సన్నీడేవిడ్, న్యూఢిల్లీ.

తమిళం : **సత్యవాజి**
ప్రతి ఆదివారం సాయంత్రం 6-45 నుండి 7-00 వరకు,
మంగళవారం, శుక్రవారం సాయంత్రం 5-30 నుండి 5-45 వరకు
గురువారం సాయంత్రం 5-45 నుండి 6-00 వరకు.
ప్రసంగీకులు : పి.ఆర్. స్వామి, బెంగుళూరు.

మళయాళం : **ది వోయిస్ ఆఫ్ ట్రూత్**
ప్రతి శుక్రవారం సాయంత్రం 3-45 నుండి 4-00 వరకు.
ప్రసంగీకులు : పి.కె. వర్గీస్, తిరువనంతపురం.

కన్నడ : **The Voice of truth**
ప్రతి ఆదివారం మధ్యాహ్నం 1-45 నుండి 2-00 వరకు.
ప్రసంగీకులు : రోబర్ట్ రత్నాకర్, బెంగుళూరు.

ఇంగ్లీషు : **The Voice of truth**
ప్రతి శుక్రవారం సాయంత్రం 7-45 నుండి 8-00 వరకు.
ప్రసంగీకులు : జె.సి. ఛోట్, అమెరికా.

T.V. తమిళం : ప్రతి మంగళవారం ఉదయం 7-00 నుండి 7-30 వరకు విజయ టి.వి.ద్వారా ప్రసంగీకులు : పీటర్ సాల్మన్, మద్రాసు

పై కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి.

ఉచిత బేసిక్ బైబిల్ కోర్సులోని పాఠముల కొరకు ఈరోజే మాకు వ్రాయండి.


**SATYA VAKKU**

**P.O. BOX 80, KAKINADA - 533 001. Phone : 0881 - 363722**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 ఫిబ్రవరి 2001 సంచిక 7

## బైబిలు గ్రంథకర్త మానవుడు కాదు-3

( Man is not the author of the Bible )

బైబిలు గ్రంథకర్త మానవుడు కాదు అనే అంశాన్ని గత రెండు సంచికలలో కొంతమట్టుకు గమనించాం. దేవుని చిత్తమయితే ఈ రోజు దానిని ముగించుకొందాం. మానవులకు సహజంగాయున్న కుతూహలాన్ని, ఆసక్తిని తీర్చడానికి పరిశుద్ధగ్రంథమైన బైబిలు ప్రయత్నం చేయడంలేదు. ఆసక్తికరమైన వారి ప్రశ్న లన్నిటికి జవాబిచ్చుటకు అది ప్రయత్నించదు. సరిగదా, "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటి ననుసరించి నడుచుకొనునట్లు బయలుపరచబడినవి యెల్లప్పుడు మనవియు, మన సంతతివారివియు అగును" అని అది చెప్పుచున్నది (ద్వితీ. 29:29).

బైబిలు గ్రంధకర్త మానవుడు కాదనడానికి ఒక నిదర్శనం - అది చెప్పకుండా యున్న సంగతులే యను దానిని గత పాఠములో కొంత గమనించాం. యేసు ప్రభువు ఏర్పరచుకొనిన అపొస్తలులను గూర్చి క్రొత్తనిబంధనలో అతి స్వల్ప సమాచారం మాత్రమేయున్నది. వారు ఏమి చదువుకొన్నారు ? ఎంత వయస్సులో యుండగా ప్రభువును వెంబడించారు ? వారి భార్యాపిల్లల సంగతి ఏమిటి ? ఎవరెవరికి ఎంతమంది పిల్లలు ? వగయిరా ప్రశ్నలు మనకు బోలెడు తలెత్తుతాయి. అయితే ఆ సమాచారాన్ని నిమిత్తమాత్రంగా క్రొత్తనిబంధన తీసిప్రక్కనబెట్టింది. వారి వ్యక్తిగత జీవితం, సమాచారం మనలను రక్షించదు. గనుక క్రొత్తనిబంధవ ఈ విషయాలలో మౌనియైయున్నది.

బాప్తిస్మమిచ్చు యోహాను యేసుక్రీస్తు మార్గమును యూదుల మధ్య సరాళము చేయుటకు ఆయనకంటె ముందు వచ్చాడు. ఎవరైతే తమ పాపముల విషయం మారుమనస్సు పొందారో, వాటిని ఒప్పుకొన్నారో అట్టివారికి అతడు బాప్తిస్మమిచ్చేవాడు (మత్తయి 3:6-6). అతడు "అరణ్యములో ఉండి పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము ప్రకటించుచు వచ్చెను" (మార్కు 1:4). "అయితే పరిసయ్యులును, ధర్మశాస్త్రోపదేశకులును అతనిచేత బాప్తిస్మము పొందక, తమ విషయమైన దేవుని సంకల్పమును నిరాకరించిరి" (లూకా 7:30).

ఇది యిట్లుండగా , యేసుయొక్క అపొస్తలులు యోహాను దగ్గర తప్పక బాప్తిస్మము పొందియుండిరని మనం అనుకొనవచ్చును. అయితే వారు బాప్తిస్మం పొందారని చెప్పే రికార్డు (లేక లేఖనము) ఎక్కడున్నది ? వారు బాప్తిస్మం పొందియుంటారని మాత్రమే మనం ఊహించుకొనవచ్చును. అంతేకాదు క్రీస్తు సంఘము స్థాపించబడిన తరువాత అపొస్తలుడైన అంద్రెయ, సీమోను, ఫిలిప్పు, బర్తొలొమయి, తోమా, లెబ్బయి మొదలగు వారు చేసిన సువార్త పనిని గూర్చిన వివరములను క్రొత్తనిబంధన మనకు తెలియజేయడం లేదు. యేసుప్రభువు

యొక్క అపొస్తలులలో ఎక్కువమంది చేసిన సువార్త పనిని గూర్చి వ్రాయకుండా మానవులెవరయినా విడిచిపెట్టగలరా? వారిలో ఎవరెవరు ఎక్కడెక్కడికి వెళ్ళి సువార్త ప్రకటించారు? వారేమేమి శోధనలు, హింసలు ఎదుర్కొన్నారు? ఎంతమందిని క్రైస్తవులుగా చేసారు? వారు సాధించిన విజయాలేమిటి? ఇవన్నీ మనం తెలుసుకోవాలని ప్రయత్నిస్తాం. అయితే వాటిని బైబిలు మనకు అందియ్యడం లేదు. సరిగదా వారెవరెవరు ఎంతకాలం జీవించారో, ఎట్లు చనిపోయారో కూడా మనకు అది తెలియజేయడంలేదు. ఒక్క అపొస్తలుడైన యాకోబు యొక్క మరణాన్ని గూర్చి తప్ప మరెవరి మరణాన్ని గూర్చి బైబిలులో వ్రాయబడి యుండలేదు. రాజైన హేరోదు యాకోబును ఖడ్గముతో చంపించెనని మాత్రమే బైబిలులో వ్రాయబడింది. మిగతా అపొస్తలుల పనిని గూర్చి, మరణాన్ని గూర్చి బైబిలులో గాక, సాధారణ చరిత్రలో మనం తెలుసుకోవలసిందే.

యేసుప్రభువు సిలువమీద ఆరు గంటలు వ్రేలాడబడిన తరువాత తన ప్రాణమును విడిచారు. అది చాల ఘోరమైన మరణం. ఆయన ప్రాణం విడువగానే యూదుల "దేవాలయపుతెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను; భూమి వణకెను; బండలు బ్రద్దలాయెను; సమాధులు తెరువబడెను; నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను; వారు సమాధులలోనుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగుపడిరి"యని బైబిలు చెప్పుచున్నది (మత్తయి 27:52-53). అయితే ఇంత గొప్ప అద్భుతం జరుగగా, ప్రజలు ఎట్లు స్పందించారు? సమాధులలో నుండి లేచిన పరిశుద్ధులు ప్రజలతో మాట్లాడారా? అయితే ఏమి మాట్లాడారు? అంతేకాదు యూదుల దేవాలయపుతెర పైనుండి క్రిందికి చిరిగిందంటే, అదేమైనా సామాన్యపనా? కానేకాదు. ఆ తెర అట్లు చినిగిపోతే యూదుల యొక్క ప్రవర్తన ఎట్లున్నది? వారు భయకంపితులయ్యారా? యాజకుల సంగతి ఏమిటి? వారే మయ్యారు? ప్రజలలో గొప్ప భయాందోళనలు కలుగలేదా? పట్టణంలో శాంతి

భద్రతలు క్షీణించిపోలేదా? ఇవన్నీ తెలిసికోవాలని మనకుండదా? అయితే క్రొత్త నిబంధన వీటి విషయమై మౌనియైయున్నది. మానవులే గనుక బైబిలును వ్రాసి యుంటే, ఈ వివరాలన్నీ పూసగ్రుచ్చినట్లు మనకు ఆ గ్రంధంలో వ్రాసియుండే వారు. అయితే బైబిలు గ్రంధకర్త మానవుడు కాదు. క్రొత్తనిబంధనలో అపొస్తలుల కార్యముల గ్రంధాన్ని మనం ఆదిమ సంఘచరిత్ర గ్రంధం అని చెప్పుకోవచ్చు. క్రీస్తుసంఘము యెరూషలేములో, 33వ సంవత్సరంలో పెంతెకోస్తుదినమున స్థాపించబడుటయే గాక, అది యూదయ, సమరయదేశములలోను, భూదిగంతముల వరకు ఎట్లు వ్యాపించిందో అపొ.కార్యముల గ్రంధము క్లుప్తముగా మనకు వివరించుచున్నది.

అపొస్తులుల కార్యములు 8వ అధ్యాయంలో ఐతియొపీయుల రాణియైన కందాకే క్రింద మంత్రియై ఆమె యొక్క ధనాగారమంతటిమీదనున్న ఐతియొపీయ నపుంసకుడు క్రైస్తవునిగా మార్పుచెందుటను గూర్చి వ్రాయబడింది. అతడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చియుండెను. అతడు తిరిగి వెళ్ళుచు తన రధముమీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంధము చదువుచుండగా సువార్తికుడైన ఫిలిప్పు అతన్ని కలసికొని క్రీస్తును గూర్చిన సువార్తను అతనికి ప్రకటించెను. "వారు త్రోవలో వెళ్ళుచుండగా, నీళ్ళున్న యొకచోటికి వచ్చినప్పుడు... ఇదిగో నీళ్ళు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రధము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు, నపుంసకుడు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలివచ్చినప్పుడు ప్రభువుఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను; అతడు ఫిలిప్పును మరెన్నడు చూడలేదు" (అపొ.కా. 8:26-39).

మార్గమధ్యంలోనే క్రైస్తవుడైన ఈ నపుంసకుడు ఐతియొపీయకు వెళ్ళి క్రీస్తు కొరకు ఎట్టి పనిచేసాడు? ఐతియొపీయ దేశపు ఆర్ధికమంత్రి క్రైస్తవుడైతే, ఆ దేశం అంతా ఎట్లు స్పందించారు? అతని పలుకుబడిని బట్టి అనేకులు

క్రైస్తవులయ్యారా? ఇట్టి ప్రశ్నలకు జవాబిచ్చుటకు క్రొత్తనిబంధన ప్రయత్నం చేయుటలేదు. అతనికి బాప్తిస్మమిచ్చిన తరువాత ఫిలిప్పు ఆజోతులో కనబడెను. అక్కడనుండి కైసరయకు వచ్చువరకు అతడు పట్టణములన్నిటిలో సంచరించుచు సువార్త ప్రకటించుచువచ్చెనని మాత్రమే క్రొత్తనిబంధన ఫిలిప్పును గూర్చి చెప్పుచున్నది (అపొ.కా. 8:40).

అపొస్తలులకార్యముల గ్రంథములో మొదటి 12 అధ్యాయాల్లోనూ అపొ. పేతురు మనకు ప్రాముఖ్యముగ కనబడతాడు. అక్కడ నుండి ఆ గ్రంథం చివరి వరకు అపొ. పౌలు మనకు ప్రాముఖ్యముగ కనబడతాడు. అనేక జనాంగముల మధ్య క్రీస్తు సువార్త త్వరితముగా వ్యాప్తిజెందుటకు అపొ.పౌలు కారకుడయ్యాడు. అపొ.కా.9వ అధ్యాయము నుండి పౌలు క్రైస్తవుడుగా మారడం, సువార్త నిమిత్తం అతడు చేసిన వివిధ ప్రయాణాలు, పొందిన హింసలు వగయిరా వ్రాయబడి యున్నవి. అపొ.కార్యముల గ్రంథం చివరకు వచ్చుసరికి యూదుల హింసవలన పౌలు గృహ నిర్బంధములో యున్నట్లు మనం చూస్తాము. అతడు కైసరుకు విన్నవించుకొనగా రోమా పట్టణమునకు తరలించబడ్డాడు. అపొ.కార్యముల గ్రంథం ముగియుసరికి రోమా పట్టణంలో పౌలు రెండు సంవత్సరముల నుండి గృహ నిర్బంధములో యుంటాడు. "పౌలు రెండుసంవత్సరములు పూర్తిగా తన అద్దెయింట కాపురముండి తన యొద్దకు వచ్చువారందరిని సన్మానించి ఏ ఆటంకము లేక పూర్ణధైర్యముతో దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించుచు, ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన సంగతులు బోధించుచు వుండెను" అను మాటలతో అపొ.కార్యముల గ్రంథము ముగిసెను (అపొ.కా. 28:31).

అయితే పౌలు కైసరు సముఖమున నిలబడ్డాడా? కైసరు ఎట్టి తీర్పుచెప్పాడు? పౌలు అతనికి కూడ సువార్త ప్రకటించాడా? ఇట్టి ప్రశ్నలకు బైబిలు జవాబిచ్చుట లేదు. చరిత్రను బట్టి పౌలు శిరచ్ఛేదనము చేయబడి చంపబడ్డాడని మనకు తెలుసు.

పౌలు కూడ ఆ సంగతిని ఎరిగినవాడై తిమోతికి ఇట్లు వ్రాసాడు : "నేనిప్పుడే ప్రాణార్పణముగా పోయబడుచున్నాను, నేను వెడలిపోవుకాలము సమీపమై యున్నది. మంచి పోరాటముపోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నా కొరకు నీతికిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును,నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించువారికందరికిని అనుగ్రహించును" (2తిమో. 4:7-8).

ఇంతవరకు మనం చూచిన ఉదాహరణలను బట్టి-బైబిలును గూర్చి యేమందుము? అది చెప్పకుండా విడిచిపెట్టిన వివరణలు సాధారణమైనవి కావు, మానవులైతే వాటిని గూర్చి చెప్పకుండాయుండలేరు. అయితే బైబిలును వ్రాయుటలో దేవుని ఆత్మ, లేక పరిశుద్ధాత్మ ఆయా లేఖకుల తలంపులను, కలమును కూడా నడిపించెననుటలో సందేహములేదు.

## నీవు క్రీస్తునందున్నావా?
## (Are You in Christ ?)

2 కొరింధీ 5:17లో ఇట్లు వ్రాయబడియున్నది. "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను' ' ఒకడు క్రీస్తునందున్నయెడల అతడు దేవునితో సహవాసము గలవాడు. క్రైస్తవుడు కాకముందు ఒకడు పాపములో యున్నవాడు. అతడు పాపమును విసర్జించి, క్రీస్తును దర్శించుకొనినవాడు క్రీస్తునందున్నవాడగును. అతడు నూతనసృష్టియని పరిశుద్ధాత్ముడు పలుకుచున్నాడు.

మానవుడు పాపముతో పుట్టినవాడు కాదు, సరిగదా అతడు దేవునికి అవిధేయుడగుట వలన పాపములో ప్రవేశించును. పసిబిడ్డలు పరలోకమున

కర్హులని యేసు మత్తయి 19:14లో బోధించెను. వయస్సు వచ్చినవారు దేవుని ఆజ్ఞలనతిక్రమించుటయే పాపము (1యోహాను 5:19). మానవుడు పాపమందు నిలిచియుండరాదు (రోమా 6:1). పాపముతో తనకు గల సంబంధమునతడు త్రుంచివేయవలెను. క్రీస్తునందెవరయితే లేరో వారు తమ అపరాధములచేతను. పాపముల చేతను ఆత్మీయముగా చచ్చినవారని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 2:1).

దేవుడు పాపమును ద్వేషించువాడు. పాపము వలన మనము దేవునితో సరియైన సహవాసము కలిగియుండుట అసాధ్యము. అందుకే "మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను. గనుక ఆయన ఆలకింపకున్నాడు" అని యెషయా ప్రవక్త పలికెను (యెష. 59:1,2). పాపము దేవుని తత్వమునకు ఖచ్చితముగా వ్యతిరేకమైనది గనుక ఆయన పాపముతో సహవాసము చేయడు.

అయితే దేవుడు మానవుని ప్రేమించినందువలన అతని పాపములు క్షమించబడి తిరిగి దేవునితో సహవాసమునేర్పరచుకొను విధానమును ఆయన నెలకొల్పెను. పాపపరిహారార్ధ బలిగా దేవుడు తన కుమారుని ఈ లోకమున కిచ్చెను. మానవుల పాపముల కొరకు యేసు శిక్షను భరించెను. అట్లు చేసి మానవులను శిక్ష నుండి తప్పించెను. అయితే పాపక్షమాపణ నొందుటకు మనము క్రీస్తునందుండవలెనని దేవుడు కోరుచున్నాడు. పాపక్షమాపణను, రక్షణను ఆయన క్రీస్తులోనే యుంచెను. క్రీస్తు యొక్క మరణములోనే మానవుల పాపములు క్షమించబడును (ఎఫెసీ 1:7).

ఒకడు క్రీస్తునందున్న యెడల రక్షణ, నిరీక్షణ, సంతోషము కలిగినవాడై యుండును. ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును ఆయన మనకు క్రీస్తునందు అనుగ్రహించెను అని ఎఫెసీ 1:3లో వ్రాయబడియున్నది. మనము క్రీస్తు

నందున్న యెడల దేవుని ప్రేమ మనకు లభించును (రోమా. 8:39, 1తిమో1:14). దేవునియొక్క కృప మనకు క్రీస్తునందు లభించును; (1కొరింథీ 1:4, 2తిమో. 2:1). క్రీస్తునందున్న యెడల మనము దేవునితో సమాధానము కలిగినవార మగుదుము (2 కొరింథీ 5:17). పాపము నుండి విమోచన మనకు క్రీస్తునందే లభించును. "కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24). పాపక్షమాపణ క్రీస్తుయేసు నందే కలదని ఎఫెసీ 1:7లో వ్రాయబడియున్నది. ఇంకను ఇట్టి ఆశీర్వాదములనెన్నిటినో క్రీస్తుయేసునందు దేవుడు మనకు లభింపజేయుచున్నాడు. అయితే క్రీస్తునందు లేనివారికి ఈ ఆశీర్వాదములు వర్తించవు.

క్రీస్తులోనికి మనము ఎట్లు ప్రవేశించగలము? అనే ప్రశ్న మీకిప్పుడు రావచ్చును. దానికి జవాబుగా గలతీ 3:26,27లను ఇప్పుడు చదువుకొందము: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" ఒకడు విశ్వాసము ద్వారా క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన యెడల అతడు దేవుని కుమారుడగునని ఈ వాక్యము చెప్పుచున్నది. ఒక మనుష్యుని విశ్వాసము, అతడు బాప్తిస్మము పొందినప్పుడు అతనిని క్రీస్తులోనికి ప్రవేశింపజేయునని ఈ వాక్యము బోధించుచున్నది. పాపక్షమాపణ క్రీస్తునందున్నది. బాప్తిస్మము పొందుట ద్వారా ఒకడు క్రీస్తులో ప్రవేశించును. ఎవరైనను క్రీస్తులోనికి బాప్తిస్మము పొందనియెడల వారు క్రీస్తును ధరించుకొనిన వారెట్లగుదురు? ఒక మనుష్యుడు క్రీస్తునందు విశ్వసించి, తన పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందునంతవరకు అతడు దేవునితో సహవాసము కలిగియుండలేడు.

ఒకడు బాప్తిస్మము ద్వారా క్రీస్తును ధరించుకొనగానే ప్రభువు అతనిని తన సంఘములో చేర్చుకొనును (అపొ.కా.2:47). గనుక ఎవడైనను క్రీస్తునందున్న

యెడల అతడు క్రీస్తుసంఘ సభ్యుడై యుండునని మనము గ్రహించుకొనగలము. క్రీస్తు యేసునందున్న ప్రజలే క్రీస్తు సంఘమైయున్నారు. కొరింథులో క్రైస్తవులు క్రీస్తుయేసు నందు పరిశుద్ధ పరచబడినవారై, పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని, వారే దేవుని సంఘమని అపొ.పౌలు పలికెను (1కొరింథీ 1:2). పాపపు లోకమునుండి సువార్త వలన పిలువబడినవారే క్రీస్తుసంఘము. అనగా క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందినవారే క్రీస్తుసంఘమై యున్నారని గ్రహించవలెను. ఇంకొక మాటలో సంఘము రక్షించబడిన ప్రజలతో సమకూడినది. క్రైస్తవులు క్రీస్తు రక్తముచే పరిశుద్ధ పరచబడినవారు గనుక సంఘము క్రీస్తు రక్తముచే కొనబడినది. క్రైస్తవులే క్రీస్తు సంఘమైయున్నారు (అపొ.కా. 20:28, ఎఫెసీ 5:25).

సంఘము క్రీస్తు శరీరమని క్రొత్తనిబంధన బోధించుచున్నది (ఎఫెసీ 1:22,23; కొలస్స 1:10). మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు ఆయన శరీరము లేక సంఘములో బాప్తిస్మము పొందియుంటిమి. "ఏలయనగా యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి యని" 1కొరింథీ 12:13 చెప్పుచున్నది. క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరమైన సంఘములో క్రైస్తవులు వివిధ అవయవములైయున్నారని క్రొత్తనిబంధన బోధించుచున్నది. "ఒక్క శరీరములో మనకు అనేక అవయవములుండినను, ఈ అవయవము లన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో, ఆలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా వుండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములై యున్నాము" (రోమా 12:5). క్రైస్తవులందరు ఏకమై యుండవలెనని యేసు ప్రార్థించెను (యోహాను 17). యేసుక్రీస్తు నందు మీరందరు ఏకముగా ఉన్నారని పౌలు గలతీయలోని క్రైస్తవులకు వ్రాసెను (గలతీ 3:28). క్రైస్తవులు ప్రభువునందు ఏకమనస్సుగలవారై యుండవలెనని అతడనేకసార్లు హెచ్చరించెను (ఫిలిప్పీ 4:2). క్రీస్తుయేసు నందు దేవునితో సహవాసము గలవాడు, క్రీస్తుయేసు

నందు దేవునితో సహవాసము గలవారితో సహవాసము కలిగియుండవలెను. ఒకే ప్రభువు, ఒకే విశ్వాసము, ఒకే బాప్తిస్మము ఎట్లున్నవో అట్లే సంఘము కూడ ఒక్కటే యున్నదని క్రొత్తనిబంధన బోధించుచున్నది (ఎఫెసీ 4:4,5). వేర్వేరు సంఘములుగా అనగా క్రైస్తవమతశాఖలుగా విడిపోవుట పాపము అని మనము గ్రహించవలెను.

మనము క్రైస్తవులమై యున్న యెడల క్రీస్తునందును ఆయన సంఘమందును ఉన్నవారమని గ్రహించవలెను. ఒకడు క్రీస్తునందు లేకుండ క్రైస్తవుడగుట ఎట్లు అసాధ్యమో అట్లే సంఘమునందు లేకుండా క్రైస్తవుడై యుండుట అసాధ్యము.

ఒకడు క్రీస్తునందున్న యెడల అతడు దేవుని కొరకు ఫలములు ఫలించ వలెనని బైబిలు బోధించుచున్నది. "నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేగాని తనంతట తానే యేలాగు ఫలింపదో. ఆలాగే నాయందు నిలిచి యుంటేనేగాని మీరు ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు.... నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయ బడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును" అని యేసు బోధించెను (యోహాను 15:4-6). క్రీస్తునందుండియు ఫలములు ఫలింపని క్రైస్తవులు యెండిపోయిన తీగలవలె నిత్యాగ్నికి లోనగుదురని యేసు బోధించెను.

ఒకడు క్రీస్తునందుండిన యెడల నిత్య జీవ నిరీక్షణ అతనికి కలదు. ఒకడు మరణ పర్యంతము యేసుక్రీస్తుకు నమ్మకముగా జీవించిన యెడల అతనికి నిత్యజీవము అనే కిరీటము వాగ్దానము చేయబడినది (ప్రకటన 2:10). అందుకే ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు అని ప్రకటన 14:13లో వ్రాయబడి యున్నది. క్రీస్తునందు మృతులైన వారెవరు? క్రీస్తునందు మృతులైనవారు క్రీస్తు నందు విశ్వసించి, తాము మృతినొందేవరకు ఆయనకు విధేయత చూపించినవారు.

నీవు క్రీస్తునందున్నావా ? ఎవడైనను క్రీస్తునందున్న యెడల అతడు నూతన సృష్టియగునని దేవునివాక్యము చెప్పుచున్నది. యేసు దేవుని కుమారుడని విశ్వసించుము (యోహాను 8:24), నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము (లూకా 13:3). నీ విశ్వాసమును ఒప్పుకొనుచూ, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము (అపొ.కా. 2:38). అప్పుడాయన నిన్ను క్రీస్తులోను ఆయన సంఘములోను చేర్చి పరిశుద్ధాత్మ అను వరమును తప్పక నీకు అనుగ్రహించును.

- జాషువా గూటం.

# సిగ్గుపడవద్దు
## (Don't be Ashamed)

క్రీస్తు సువార్తను గూర్చి కొందరు సిగ్గుపడుదురు. వారు దేవునియందును, క్రీస్తునందును విశ్వాసముంచువారని ఇతరులకు తెలియజేయుటకు సిగ్గుపడుదురు. వారాయన సంఘమును గూర్చి కూడ చెప్పుటకు సిగ్గుపడుదురు. సత్యముతో నిలబడుటకు, అసత్యాన్ని ఖండించుటకు వారు వెనుకాడుదురు.

అయితే వారు అట్లు ఎందుకు ప్రవర్తిస్తారు? ఈ లోకాన్ని ప్రేమిస్తు, ఈ లోకస్తులతో సహవాసము కలిగియుండుట వలన వారట్లు చేస్తారు. వారు పేరు కొరకు ప్రాకులాడుతారు. అందరిచేత అంగీకరించబడాలని కోరతారు. సంకుచిత స్వభావులని, అల్పసంఖ్యాకులని పిలువబడుటకు వారు ఇష్టపడరు. క్రీస్తును గూర్చి చెప్పుటమాని క్రైస్తవేతరులైన తమ మిత్రులతో నెమ్మదిగా మిళితమైపోతారు. ఆదిమక్రైస్తవులకు వీరు భిన్నంగా యుంటారు. ఆదిమ క్రైస్తవులు ప్రభువు కొరకు ప్రాణములర్పించారు. ఆయనను వారు కాదనలేదు. "ఆయన నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడినందున వారు సంతోషించు చుండిరి" (అపొ.కా. 5:41).

అపొ. పౌలు యిట్లు చెప్పాడు. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది. ఎందుకనిన- నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాస మూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవునినీతి దానియందు బయలుపరచబడుచున్నది" (రోమా 1:16-17). "మరియు నేను ఏవిషయములోను సిగ్గుపడక యెప్పటివలెనే యిప్పుడును పూర్ణధైర్యముతో బోధించుట వలన నా బ్రతుకు మూలముగానైనను సరే, చావు మూలముగానైనను సరే క్రీస్తు నా శరీరమందు ఘనపరచబడునని నేను మిగుల అపేక్షించుచున్నాను" అని అతడు చెప్పెను (ఫిలిప్పీ 1:19-20).

తిమోతికి వ్రాస్తు అతడు మరల యిట్లనెను. "కాబట్టి నీవును మన ప్రభువు విషయమైనసాక్ష్యమును గూర్చియైనను, ఆయన ఖైదీనైన నన్ను గూర్చియైనను సిగ్గుపడక, దేవుని శక్తిని బట్టి సువార్త నిమిత్తమైన శ్రమానుభవములో పాలివాడవై యుండుము. మన క్రియలను బట్టి కాక, తన స్వకీయసంకల్పమును బట్టియు, అనాదికాలముననే క్రీస్తుయేసు నందు మనకు అనుగ్రహింపబడినదియు, క్రీస్తు యేసగు మన రక్షకుని ప్రత్యక్షత వల్లన బయలు పరచబడినదియునైన తన కృపను బట్టియు, మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. ఆ క్రీస్తుయేసు మరణమును నిరర్ధకము చేసి జీవమును, అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను. ఆ సువార్త విషయములో నేను ప్రకటించువాడను గాను, అపొస్తలుడునుగాను, బోధకుడను గాను నియమింపబడితిని. ఆ హేతువుచేత ఈ శ్రమలను అనుభవించుచున్నాను గాని, నేను నమ్మినవాని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను" (2తిమోతి 1:8-12).

"దేవుని యెదుట యోగ్యుని గాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" అని కూడ పౌలు హెచ్చరించాడు (2తిమో. 2:15). దేవుని గూర్చియు ఆయన పిల్లలను గూర్చియు చెబుతు, హెబ్రీ పత్రిక లేఖకుడిట్లనుచున్నాడు "ఎవని నిమిత్తము సమస్తమును ఉన్నవో, యెవని వలన సమస్తమును కలుగుచున్నవో, ఆయన అనేకులైన కుమారులను మహిమకు తెచ్చుచుండగా వారి రక్షణకర్తను శ్రమల ద్వారా సంపూర్ణునిగా చేయుటకు ఆయనకు తగును. పరిశుద్ధపరచువారికిని, పరిశుద్ధ పరచబడువారికిని అందరికి ఒక్కటే మూలము. ఈ హేతువు చేతను వారిని సహోదరులని పిలుచుటకు ఆయన సిగ్గుపడక-నీ నామమును నా సహోదరులకు ప్రచురపరతును, సమాజము మధ్య నీ కీర్తిని గానము చేతును అనెను" (హెబ్రీ 2:10-12). "అయితే వారు మరి శ్రేష్ఠమైన దేశమును, అనగా పరలోక సంబంధమైన దేశమును కోరుచున్నారు. అందుచేత తాను వారి దేవుడనని అనిపించుకొనుటకు దేవుడు వారిని గూర్చి సిగ్గుపడడు; ఏలయనగా ఆయన వారి కొరకు ఒక పట్టణము సిద్ధపరచియున్నాడు (హెబ్రీ 11:16).

అపొ. పేతురు యిట్లు చెప్పాడు "నిర్మలమైన మనస్సాక్షి కలవారై, మీలో వున్న నిరీక్షణమ గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానముచెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగావుండి, మీ హృదయములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి; అప్పుడు మీరు దేని విషయమై దుర్మార్గులని దూషింపబడుదురో దాని విషయమై క్రీస్తునందున్న మీ సత్ప్రవర్తన మీద అపనిందవేయువారు సిగ్గుపడుదురు" (1పేతురు 3:16-18). మరల "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరుమ బట్టియే దేవుని మహిమ పరచవలెను" అని అతడు చెప్పెను (1పేతురు 4:16)

యేసుప్రభువు ఇట్లన్నారు "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో, పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" (మత్తయి 10:32,33). "వ్యభిచారమును, పాపమును చేయు ఈ తరమువారిలో నన్ను గూర్చియు, నా మాటలను గూర్చియు సిగ్గుపడు వాడెవడో, వానిని గూర్చి మనుష్యకుమారుడు తన తండ్రి మహిమగలవాడై పరిశుద్ధదూతలతో కూడ వచ్చునప్పుడు సిగ్గుపడునని చెప్పెను" (మార్కు 8:38).

మిత్రుడా, నీవు దేవుని యెదుట ఎట్లున్నావు?

- నీవాయనయందు విశ్వాసముంచుచున్నావా? లేదా నిరాకరించుచున్నావా? (హెబ్రీ 11:6; యోహాను 14:1).

- నీవు ప్రభువు సంఘములో యున్నావా? లేదా మానవకల్పిత మతశాఖలో యున్నావా? (మత్తయి 16:18).

- నీవు క్రీస్తునామమును ధరించావా? లేదా మానవకల్పితనామమును కలిగియున్నావా? (అపొ.కా. 4:12).

- అంత్యదినమందు ప్రభువు వాక్యమును బట్టియే మనకు తీర్పు తీర్చబడునని జ్ఞాపకముంచుకొనుము (యోహాను 12:48).

- క్రీస్తును ఆయన చిత్తమును నిరాకరించవద్దు. ఆయనను గూర్చి సిగ్గు పడవద్దు. ఆయనకు లోబడి, ఆయన కొరకు జీవించు. ఒకానొక దినమందు ఆయన నిన్ను తనవాడని గుర్తించి, పరలోకంలో నిత్యనివాసం నీకనుగ్రహించును.

- జె.పి. ఛోట్.

# గుడ్డు సందేశం

కోడి గుడ్డును చూచారా?

క్రొత్తజన్మకు పాఠం చెపుతోంది.

కోడి పొదిగితే వేడికి గుడ్డు పగులుతుంది.

గుల్లలోంచి పిల్ల బయటకొస్తుంది !

పరిశుద్ధాత్మాగ్ని (వాక్యము) పాపిని దహిస్తే

మనిషిలోని ఆత్మకు క్రొత్తజన్మవస్తుంది.

కోడితో వున్న పిల్లకు గ్రద్దభయం లేదు.

క్రీస్తులో వున్న విశ్వాసికి సాతాను భయముండదు !

బాతులు గ్రుడ్లు పెట్టినా తమ జాతిని మాత్రం

విస్తరించుకోలేవు - నిప్పుకోళ్ళూ,అంతే; (యోబు 39:13-16)

కొందరు పిల్లల్ని కంటారు వారిని మాత్రం

మంచిదారిలో పెంచి నడిపించలేరు !

పక్షులకంటే మనుష్యులు శ్రేష్టులే అయినా (మత్త. 6:26)

పక్షినిచూచి నేర్వాల్సింది చాలా వుంది (మత్త. 23:37; ద్వితీ. 32:11)

కొన్ని గుడ్లు చెడిపోయి కంపుకొడతాయి

వేషధారులైన బోధకులు, విశ్వాసులు అంతే !

పాముల గుడ్లు పగిలితే మిడినాగులు వస్తాయి

పాపాత్ములు నోరు తెరిస్తే విషం స్రవిస్తుంది

దుష్టబుద్ధులున్నవాళ్ళు సర్పసంతానమైతే;

పాతాళం వారికోసం ఆశతో చూస్తుంది !

(కీర్తన. 58:3-4; 14:2-3; 9:17; యెష. 5:14)

- యస్. జె. మేడిది, కొణితివాడ.

# క్రీస్తు-ధర్మశాస్త్రము ?
## CHRIST OR LAW ?

ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను

కృపయు, సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను - (యోహా. 1:17)

### ధర్మశాస్త్రము ఒక్కటే

1. ధర్మశాస్త్రము. - లూకా 2:27
2. యెహోవా ధర్మశాస్త్రము - కీర్త. 1:2
3. దేవుని ధర్మశాస్త్రము - నెహె. 8:18
4. మోషే ధర్మశాస్త్రము - లూకా 2:22
5. ప్రభువు ధర్మశాస్త్రము - లూకా 2:24
6. వివిధరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రము - ఎఫె 2:14

పైన తెలుపబడిన ధర్మశాస్త్రములు ఆరు కలవా? లేక ఒకే ధర్మశాస్త్రము ఆరు విధములుగా పిలవబడెనా? అవును ఒకే ధర్మశాస్త్రము ఆరు విధములుగా పిలిచినట్లు వ్రాయబడెను.

### ఆలాగే సువార్తలు ఎన్ని?

1. సువార్త - 1కొరిం. 1:21.
2. దేవుని సువార్త - 1థెస్స. 2:8,9.
3. క్రీస్తు సువార్త - గలతి. 1:7.
4. మా సువార్త - 11థెస్స. 2:14.
5. నా సువార్త - రోమా 2:16.
6. మేము మీకు ప్రకటించిన సువార్త - గలతి. 1:8.

పైన తెలుపబడిన సువార్తలు 6 గలవా? లేక ఒక్క సువార్త ఆరు

విధములుగా పిలవబడెనా? అవును సువార్త ఒక్కటే. ఆరు విధములుగా పిలువబడెను.

అయితే కొందరు అబద్దబోధకులు దేవుని ధర్మశాస్త్రము వేరు, మోషే ధర్మశాస్త్రము వేరు అని విభజించి బోధించుచున్నారు. అలాగే క్రీస్తు సువార్త వేరు, పౌలు సువార్త వేరు అని విభజించి బోధించేవారు లేకపోలేదు.

మనము భిన్నమైన సువార్తకు లోనుకాకుండునట్లు క్రీస్తువాక్యమును ఉన్నది ఉన్నట్లు విశ్వసించుట అవసరము.

## ధర్మశాస్త్రమును గూర్చి క్రీస్తు వాక్యము ఏమి చెప్పుచున్నది?

1. ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగజేయలేదు.
2. ధర్మశాస్త్రము బలహీనమైనది.
3. ధర్మశాస్త్రము నిష్ప్రయోజనమైనది.
4. ధర్మశాస్త్రము నివారణ చేయబడియున్నది -హెబ్రీ 7:18-19
5. ధర్మశాస్త్రము కొట్టివేయబడెను - హెబ్రీ 9:10.
6. ధర్మశాస్త్రముచేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడను సంగతి స్పష్టమే -గలతి. 3:11.
7. ధర్మశాస్త్రసంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును నీతిమంతుడని తీర్చబడడు. దానికి ధర్మశాస్త్రమును, ప్రవక్తలును సాక్ష్యమిచ్చుచున్నారు - రోమా 3:20.

8. ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతి బయలుపరచబడుచున్నదని ధర్మశాస్త్రమును, ప్రవక్తలును సాక్ష్యమిచ్చుచున్నారు.

9. ధర్మశాస్త్రము వలన ధర్మశాస్త్ర విషయములో చచ్చిన వారమగుదుము - గలతి 2:19.

10. మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరుచేయబడియున్నారు. కృపలో నుండి తొలగిపోయి యున్నారు. - గలతి. 5:4.

11. ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవదానికి అవకాశముండనేరదు - హెబ్రీ 8:7.

12. ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసియున్నాడు -హెబ్రీ 8:13.

13. పాత నిబంధన క్రీస్తు నందు కొట్టివేయబడెను - (11 కొరిం. 3:14-16).

## విశ్రాంతి దినము

ధర్మశాస్త్రముతో పాటు పాత నిబంధన అందలి విశ్రాంతిదినము కూడ క్రీస్తు నందు కొట్టివేయబడెను.

**1. యేసుక్రీస్తు విశ్రాంతి దినమును అలక్ష్యము చేసెను**

విశ్రాంతి దినము మనుష్యుల కొరకు నియమింపబడెను. మనుష్యులు విశ్రాంతి దినము కొరకు నియమింపబడలేదు. క్రీస్తు విశ్రాంతిదినమునకు ప్రభువైయున్నాడు - మత్తయి 12:1,8; మార్కు 2:23-28.

విశ్రాంతి దినమున రోగులను స్వస్థపరచెను, అనగా విశ్రాంతిదినమున ఆయన పనిచేసెను, ఇతరులకు పనిచెప్పెను, ప్రయాణము చేసెను - యోహాను 5:8-11; లూకా 13:16; మార్కు 3:16; యోహా. 5:16-18.

**2. అపొ. పౌలు విశ్రాంతి దినమును లక్ష్యపెట్టలేదు.**

అపొ. పౌలు తరచు యూదుల సమాజమందిరములలోనికి వెళ్ళి విశ్రాంతి దినములో నిజమైన విశ్రాంతి లేదు, నిజమైన క్రీస్తులో వున్నదని బోధించెడివాడు. ప్రతి దినము యూదుల సమాజమందిరములలోను, సంత వీధులలోను యూదులకు బోధించుచూ, తర్కించుచూ వాదించేవాడు.

కొందరు అబద్ధబోధకులు పౌలు విశ్రాంతి దినములలో యూదుల సమాజమందిరమునకు వెళ్ళెను గనుక అపొ.పౌలు విశ్రాంతి దినమును ఆచరించే వాడని చెప్పుచున్నారు. అయితే పౌలు యూదుల సమాజ మందిరములలోనే కాదు సంతవీధులలోను, పాఠశాలలోను కూడ యూదులను కలుసుకొని క్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించుచూ తర్కించుచుండెడివాడు. ఇందును బట్టి ప్రతి దినమును సంతవీధులలో విశ్రాంతిదినమును ఆచరించుటకే వెళ్ళెనని చెప్పగలరా? అట్లయిన పౌలు విశ్రాంతి దినమును ఆచరించినయెడల యూదులెందుకు ఆయనతో తర్కించెదరు? ఎందుకు దొమ్మిగా వచ్చి ఆయనపై బడి సభలకు ఈడ్చెదరు? అపొ. 17:1-9, 17-18. పౌలు ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా దేవుని ఆరాధించుటకు జనులను ప్రేరేపించుచున్నాడని యూదులు ఎందుకు ఫిర్యాదుచేసిరి? (అపొ. 18:12,13). అతడు ధర్మశాస్త్రమును పెంటగా నెంచినందున (ఫిలి. 3:7-11) వారు నిజమే ఫిర్యాదుచేసిరి. పౌలు ధర్మశాస్త్రమును కూడ విడిచెను. అట్లు చేయుట యేసుక్రీస్తు యొక్క ఉపదేశక్రమమే. క్రీస్తు - నాయొద్దకు రండి అని చెప్పెను గదా! (మత్తయి 11:28-30). అందుకే క్రీస్తు కూడ విశ్రాంతి దినమును అలక్ష్యము చేసెను. క్రీస్తులోనే విశ్రాంతి కలదు.

గనుక నేటికిని విశ్రాంతి దినమును ఆచరించుచు యూదుల వలె కనపరచుకొనుట యూదుల పర్ణశాలల పండుగ, పెంతెకొస్తు పండుగ మొదలైనవి ఆచరించుచున్నారు. అవి క్రీస్తుకు ఛాయారూపము గలవే కాని నిజస్వరూపము గలవి కావు. నిజస్వరూపము క్రీస్తు. - (హెబ్రీ 10:1, కొలస్స 2:16,17). క్రీస్తు వచ్చిన పిమ్మట అవన్నీ నిలిచిపోయెను.

అన్యజనులలో నుండి దేవుని వైపు తిరిగినవారు ధర్మశాస్త్రమును అనుసరించకూడదని బోధింపబడిరి. - అపొ. 15:10,11,14,19,20.

అన్యజనులలో నుండి దేవుని వైపు తిరిగినవారు యూదుల మతముతో మిశ్రమము కాకుండునట్లు నేరుగా క్రీస్తులోనికి వచ్చి క్రీస్తు బోధయందు నిలిచి క్రీస్తు సంఘముగా ఉండవలెను అనునది దేవుని చిత్తము (మత్తయి 16:18, అపొ. 20:28).

అట్లు గాక యూదులుకాని అన్యజనులు యూదులవలె ప్రవర్తించిన యెడల లేక యూదామతాచారములను ఆచరించిన యెడల వారు సాతాను సమాజకులై యుందురని లేఖనము చెప్పుచున్నది - (ప్రక. 2:9; 3:9).

పై అంశములలో మీకేమైనా సందేహములు వున్నయెడల మాతో సంప్రదించండి. అబద్ధబోధలను విడిచి క్రీస్తు బోధయందు నిలకడగా వుండి క్రీస్తు రాజ్యములో నిరంతరము సూర్యుని వలె తేజరిల్లుచుండవలెనని కోరి ఈ సంగతి మీకు వ్రాయుచున్నాను.

- గూటంపాల్, గొల్లవిల్లి.

# నీ మార్గమును బలపర్చుము

## (Strengthen your Way)

పాతనిబంధన ప్రవక్తలలో మోషే తరువాత ఏలీయాను గూర్చి క్రొత్త నిబంధనలో పలుమార్లు చెప్పబడింది. బాప్తిస్మమిచ్చు యోహాను ఏలీయా వంటి ఆత్మ గలవాడని చెప్పబడింది. రూపాంతర సమయంలో అతడు యేసుకు ప్రత్యక్షమయ్యాడు, అతని గూర్చి యేసు లూకా 4:25లోను, పౌలు రోమా 11:2లోను, యాకోబు పత్రిక 5:17లోను చెప్పడం జరిగింది. ఇశ్రాయేలు రాజగు అహాబుకాలంలో దేవుడు ఈ ప్రవక్తను నిలబెట్టాడు. అతని ప్రవచనమును బట్టి ఇశ్రాయేలులో $3\frac{1}{2}$ సంవత్సరములు వర్షము కురియలేదు. ఈ క్షామకాలంలో ఇశ్రాయేలు దేశమంతా శ్రమపడినను ఈ ప్రవక్తను పోషించడానికి దేవుడు ఏర్పాట్లు చేసాడు. మొదట కాకోలముల ద్వారా దేవుడతని పోషించాడు. తరువాత సారెపతులో యున్న ఒక విధవరాలి దగ్గరకు ఆయన అతని పంపించాడు. మరల అతడు ప్రార్థనచేయగా ఇశ్రాయేలులో వర్షము కురిసింది. అతడు భయములేకుండా రాజునెదుర్కొన్నాడు. నాలుగువందలయాభైమంది బయలు దేవతా ప్రవక్తలనతడు సవాలు చేసాడు, ఆ సవాలునతడు జయించిన తరువాత 450 మంది బయలు దేవతా ప్రవక్తలందరిని కీషోను వాగు దగ్గర వధించాడు. ఏలీయా చేసినదంతయు క్రూరురాలైన యెజెబెలుకు తెలియగా అతని చంపుదునని ఆమె అతనికి వర్తమానము పంపెను.

ఇక్కడ ఏలీయా వింతప్రవర్తనను మనం గమనించగలము. అతడు నిర్భయంగా రాజునెదుర్కొన్నాడు, ఏకాకిగా 450మంది బయలు ప్రవక్తలను సవాలు చేసాడు గాని యెజెబెలునకతడు భయపడి ప్రాణభయము కలిగి బెయేర్షెబాకు చేరి తాను ఒక దిన ప్రయాణము అరణ్యములోనికి పోయి ఒక బదరీ వృక్షము క్రింద మరణాపేక్ష గలవాడై ఆ వృక్షము క్రింద పరుండి నిద్రించుచుండగా "ఒక

దేవదూత వచ్చి అతని ముట్టి నీవులేచి భోజనము చేయమని చెప్పెను... గనుక అతడు భోజనముచేసి తిరిగి పరుండెను. అయితే యెహోవా దూత రెండవమారు వచ్చి అతని ముట్టి - నీశక్తికి మించిన ప్రయాణము నీకు సిద్ధమైయున్నది. నీవు లేచి భోజనము చేయమని చెప్పినపుడు అతడు లేచి భోజనము చేసి ఆ భోజనపు బలముచేత నలుబది రాత్రింబగళ్ళు ప్రయాణము చేసి దేవుని పర్వతమని పేరు పెట్టబడిన హోరేబునకు వచ్చెను" (1 రాజులు 19:5-8).

## క్రైస్తవుని ప్రయాణం

ఒకడు దేవుని వాక్యమును నమ్మి, విధేయత చూపుచు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు అతడు క్రైస్తవునివలె తన ప్రయాణమునారంభించును. యేసు, "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడని" చెప్పాడు (యోహాను 14:6). తండ్రి యొద్దకు వెళ్ళాలంటే మనకొక దీర్ఘప్రయాణమున్నది. యిది మన శక్తికి మించినది. ఈ లోకంలో శిశువు జన్మించిన తరువాత ఆహారం లేకుండా ఎట్లు బ్రదుకలేడో అట్లే మన ప్రభువు యొక్క ఆత్మీయరాజ్యములోనికి జన్మించిన వాడెవడు ఆత్మీయాహారము లేకుండ బ్రదుకలేడు. అందువలన "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆపాలను-అపేక్షించుడి" యని పేతురు చెప్పుచున్నాడు (1పేతురు 2:2).

## క్రైస్తవుని ఆహారం

ప్రభువతని కనుగ్రహించిన ఆహారాన్ని ఏలియా భుజించి బలముపొంది దేవుని పర్వతమును చేరుటకు నలుబది రేయింబగళ్ళు ప్రయాణంచేసాడు. క్రైస్తవులవలె మనం చేయు ప్రయాణంలో దేవుని పర్వతమును చేరుటకు మనకు కూడ శక్తి అవుసరం. ఏలయనగా మన ప్రయాణం శక్తికిమించినదే. గనుకనే ప్రభువు తాను మనకిచ్చే ఆహారాన్ని భుజించుడని చెప్పుచున్నాడు; అదే దేవుని వాక్యం.

క్రైస్తవయాత్ర నారంభించిన తరువాత అనేకులు మార్గములో పడిపోతారు. ఎందుచేత? తమ యాత్రనంతటినీ జరిగించుటకు వారిలో బలములేదు. ప్రభువు అనుగ్రహించు ఆహారాన్ని వారు భుజించరు గనుక వారికి బలము, లేక శక్తి యుండదు. మన జీవితాల్లో సరిపడినంత బైబిలు పఠనం లేకపోవుటయే మన బలహీనతకు మూలకారణం. మనం పాపములో పడకుండు నిమిత్తము ప్రభువు తన వాక్యము ద్వారా మనల్ని నడిపిస్తాడు, బలపరుస్తాడు.

## దేవుని వాక్యం ఇచ్చే శక్తి

"మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలను బట్టియే నీతిమంతుడవని తీర్పు నొందుదువు; నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు పొందుదువని" యేసుప్రభువు చెప్పారు (మత్త. 12:36,37). ఈ వాక్యము మన హృదయములో నివసించినయెడల నోటి ద్వారా మనము పాపము చేయకుందుము. అది దుర్భాషలాడకుండ, ఇతరులను నిందించకుండ, అబద్ధములాడకుండ మన నాలుకను అదుపులో యుంచును. మరల నీ శత్రువులను, నీ పొరుగువానిని ప్రేమించుమని దేవుని వాక్యం చెప్పుచున్నది. మనమట్లు చేసినపుడు యితరులకు ఏ హానియు చేయకుందుము. మనము పాపములో పడకుండ దేవుని వాక్యము సహాయం చేస్తాది. "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నాహృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను" అని అందుకే దావీదు చెప్పాడు (కీర్తన 119:11).

ఆపదలలో దేవుని వాక్యము మనకు ఆదరణ నిస్తాది. "గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు. నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును" (కీర్తన 23:4). "యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి

పరుగెత్తి సురక్షితముగా నుండును" (సామె. 18:10). "యెహోవా ఉత్తముడు, శ్రమదినమందు ఆయన ఆశ్రయదుర్గము. తనయందు నమ్మికయుంచువారిని ఆయన ఎరుగును" (నహూము 1:7). మన ఆపత్కాలములో ఆదరణనిచ్చు యిట్టి వాక్యములనెన్నిటినో మనం కనుగొనగలము. దేవుని వాక్యము మనకు నిత్యజీవనిరీక్షణ ననుగ్రహిస్తాది. ఆయన మార్గములో నమ్మకముగా యుండునట్లు సహాయపడ్తాది. దేవునివాక్యం దేవుని యొక్క ఘనతను, మహిమను, ఆయన శక్తిని మనకు తెలియజేస్తాది. భూమి, సూర్యచంద్ర నక్షత్రాదులు కల్గిన విధానాన్ని తెలియజేస్తూ దేవుని బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కులగునట్లు అది మనకు సహాయం చేస్తాది.

బైబిలు చదవడానికి మనకు సహాయం దొరుకుటలేదని సాకులు చెప్పేస్తాం. గాని యెహోవా ధర్మశాస్త్రనందానందించుచు దివారాత్రములు దానిని ధ్యానించు వాడు ధన్యుడు (కీర్తన 1). మనం విశ్వసించి మారుమనస్సు పొంది బాప్తిస్మము పొంది, క్రైస్తవయాత్ర నారంభించినను, బలము లేనియెడల ఆ ప్రయాణంలో నిలువలేము. లిఖింపబడిన దేవునివాక్యము (బైబిలు) మన ప్రయాణానికి కావలసినంత శక్తినిచ్చును. గనుక ప్రతి దినము జీవాహారమును భుజించుచు, బలము పొంది దేవుని పర్వతమునొద్దకు మనం చేరుకొందము గాక !

**- కవిత గూటం, కాకినాడ.**

## సంక్షిప్త వార్తలు

2001 జనవరి 8వ తేదీ సోమవారం సాయంత్రం పిఠాపురం, ఇందిరా కాలనీలో జరిగిన సువార్త కూటములో జాషువా గూటం గారు సతీసమేతముగా పాల్గొనిరి. వాక్య పరిచర్య చేసిరి. స్థానిక సంఘమును ప్రోత్సహించిరి. అక్కడ సోదరులు వేమగిరి యేసు గారు స్థానిక సువార్తికులుగా యుండి మంచిపనిని చేయుచున్నారు.

జనవరి 21 నుండి 24 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో 16వ బైబిలు లెక్చర్‌షిప్ జరిగెను. దానిలో పాల్గొనుటకు ఆంధ్రప్రదేశ్‌లో ఇంచుమించు అన్నిజిల్లాల నుండి సోదర సోదరీలు వచ్చిరి. కూటములను జయప్రదము చేసిరి. వాక్య పరిచర్య నిమిత్తము అమెరికా నుండి సోదరులు బిల్ మయర్స్ మరియు రాబర్ట్ లూపో గారును, కలకత్తా నుండి సోదరులు కె.స్వామిదాస్ గారును విచ్చేసి వాక్య పరిచర్య చేసిరి. మరియు సోదరులు టి.వి.యస్.కుమార్, జాషువా గూటం, బొంతు ధనరాజు, ఆర్.సి.హెచ్.సద్గుణరావ్, నెహెమ్యా గూటం గార్లు కూడ వాక్య పరిచర్య చేసిరి.

ప్రతిరోజు మధ్యాహ్నం వివిధ ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులు వారు చేయుచున్న సువార్త పనిని గూర్చి, పొందుచున్న అభివృద్ధిని గూర్చి, ఎదుర్కొనుచున్న శోధనలను గూర్చి మిషన్‌ఫోరంలో తెలియజేయుచు వచ్చిరి. సోదరులు జి.ప్రసాద్ (వరంగల్), బి.జాన్‌మోజెస్ (కత్తిపూడి), యస్.ప్రభుదాస్ (పాలకొల్లు), పి.సురేంద్ర కుమార్ (మణుగూరు), పి.చంద్రశేఖర్ (రాయుడుపాలెం), వంజా ప్రసాద్‌రావ్ (హైదరాబాద్), పాల్ సుబాన్ (నెల్లూరు), జి.మార్కు (నందిగామ), హెన్రీపాల్ (పాదిలి) తదితరులు ఈ సువార్త వేదిక (Mission Forum) లో పాల్గొని తమ పనిని వివరించిరి.

దూరప్రాంతముల నుండి వచ్చిన వారికి మంచి భోజన వసతి సదుపాయములు కల్పించబడెను. ఈ లెక్చర్‌షిప్‌లో ఇరవైమంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈ భారభరితమైన కార్యమును జయప్రదముగా జరిగించినందుకు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ నెహెమ్యా గూటం గారు అభినందనీయులు.

నందిగామ నెహ్రూనగర్ క్రీస్తు సంఘము Bro. గడ్డం మార్కు, వారి సహోదరులు గత సంవత్సరము నుండి నందిగామ సబ్‌జైలు ఖైదీలకు ప్రతి ఆదివారము ప్రార్థన నిర్వహించి వాక్య పరిచర్య చేయుచుండిరి. ఖైదీలుండు గదులకు నీటివసతి లేక ఖైదీలు అనుభవించుచున్న అసౌకర్యమును గమనించి సంఘనిధి నుండి పైపులు వేయించి, పంపులు పెట్టించి నీటివసతి కలిగించిరి. ది.3-1-2001 తేదీన సబ్‌జైలు నందు ఒక మీటింగ్ ఏర్పాటుచేసి Bro. టి.వెంకటేశ్వరరావు ప్రార్థన చేయగా సదరు సంఘ సేవకుడు Bro. గడ్డం మార్కు మత్త.25:31-46 నుండి వాక్య పరిచర్య చేసిరి. తదనంతరం, నందిగామ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీదేవినేని ఉమా మహేశ్వరరావు నీటి పంపులు ఓపెన్ చేసి, స్థానిక నెహ్రూనగర్ క్రీస్తుసంఘము, Bro. గడ్డం మార్కు గారు చేయుచున్న గొప్పసేవను ప్రశంసించిరి. తదనంతరం, ఖైదీలకు సభకు వచ్చినవారికి ఉచితముగా బైబిలు గ్రంథములు, పండ్లు పంచిపెట్టిరి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2001

From:
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004 Editor : Joshua Gootam